ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు
TAMILNADU

గురువారం 29 ఆగస్టు 2024

భాషోద్యమంలో తొలి అడుగు గిడుగుదే

- తెలుగు భాషా దినోత్సవంలో అనిల్‌కుమార్ రెడ్డి
- అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవనంలో ఘనంగా జయంతి వేడుకలు



తెలుగు భాషా దినోత్సవంలో అనిల్‌కుమార్‌రెడ్డి, నిర్మలా పళనివేలు, బిట్రా గజగౌరి తదితరులు

ప్యారీస్, ఆగస్టు 28: భాషోద్యమంలో తొలి అడుగు వేసిన మహనీయులు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు అని అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ అధ్యక్షులు, ప్రముఖ పారిశ్రామికవేత్త కె.అనిల్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. మైలాపూర్‌లోని అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని బుధవారం తెలుగు భాషాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. వసుంధర ప్రార్థనా గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జేఎం నాయుడు స్వాగతోపన్యాసం చేశారు. సభాధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... 1883 ఆగస్టు 29న శ్రీకాకుళం జిల్లాలోని ఓ సామాన్య కుటుంబంలో జన్మించిన గిడుగు రామ్మూర్తి పంతులు 150 ఏళ్ల క్రితమే భావ వ్యక్తీకరణకు సరిపోయే భాష గ్రాంథికం కాదని గ్రహించి, తెలుగు భాషను వ్యవహారిక భాషగా తీర్చిదిద్దార న్నారు. తెలుగు వారు ఏ ప్రాంతంలో ఉన్నా నిరంతరం ఆయన్ని స్మరించుకోవాలని, ఇలాంటి సభల్లో ఆ మహనీయుని తెలుగు భాషా సేవల గురించి విద్యార్థులకు, యువతకు తెలియజేయాలన్నారు. ఒడిసాలో ఆదివాసీయులు, గిరిజనులు దక్షిణ రాష్ట్రాల్లో వాడుకలో ఉన్న భాషల్లోని పదాలను చేర్చి మాట్లాడుతుండేవారని, భాష ఒక్కటైనప్పటికీ సరళంగా మాట్లాడుకొనేలా వారి కోసం సవర భాష, తెలుగు వారి కోసం తెలుగు భాషను వ్యవహారిక భాషగా తీసుకొచ్చారని కీర్తించారు. ఇటీవల స్మారక భవనాన్ని సందర్శించిన ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు భవన నిర్వాహక కమిటీ ఎదుర్కొంటున్న సమస్యలు, కమిటీ తరఫున కొన్ని కోర్కెలు తెలియజేశామన్నారు. దీనిపై స్పందించిన ఆయన, భవన నిర్వహణకు అవసరమైన నిధులు, గ్రంథాలయం విస్తరణ గురించి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్‌తో మాట్లాడి పరిష్కరింపజేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి మనకు మంచి శుభవార్త అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ కమిటీ తరఫున భవిష్యత్తులో మరిన్ని తెలుగు కార్యక్రమాలు జరుపుకొనేందుకు వీలుగా కమిటీ సభ్యుడు గుడిమెట్ల చెన్నయ్యను సాంస్కృతిక కార్యదర్శిగా నియమించినట్లు అనిల్‌కుమార్ రెడ్డి సభలో ప్రకటించారు. కాగా, ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత ఆచార్యులు డా.నిర్మలా పళనివేలు, ఆత్మీయ అతిథి చెన్నై ఆకాశవాణి కేంద్రం విశ్రాంత ఉద్ఘోషకురాలు బిట్రా గజగౌరి తదితరులు గిడుగు సేవలను వివరించారు. ఈ వేడుకలో సభ్యులు గుడిమెట్ల చెన్నయ్య, డా.ఏవీ శివకుమారి, డా.ఎంవీ నారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

భాషా విధానాన్ని సమీక్షించండి

- ద్విభాషా విధానం అప్రస్తుతం
- రాష్ట్ర ప్రభుత్వానికి 'లింఫోట్' విజ్ఞప్తి

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చదువుకుంటున్న వివిధ భాషల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని భాషా విధానాన్ని సమీక్షించాలని రాష్ట్ర ప్రభుత్వానికి 'లింగ్విస్టిక్ మైనారిటీస్ ఫోరం ఆఫ్ తమిళనాడు' (లింఫోట్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు లింఫోట్ చైర్మన్ ఆచార్య సీఎంకే రెడ్డి బుధవారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో భాషాపరమైన మైనారిటీలు తమిళంతో పాటు తమ మాతృభాషలో చదువుకునేందుకు దేశ సర్వోన్నత న్యాయస్థానమే అనుమతించినందున ద్విభాషా విధానం ఇప్పుడు అప్రస్తుతమన్నారు. రాష్ట్ర జనాభాలో 40 శాతం మంది పాఠశాలల్లో 3 భాషలను చదువుతున్నారని గుర్తు చేశారు. జాతీయ విద్యావిధానాన్ని తిరస్కరించడం వల్ల మన విద్యార్థులు ఇతర రాష్ట్రాల వారితో పోటీ పడడంలో, కేంద్రప్రభుత్వ ఉద్యోగాలను పొందడంలో వెనుకబడిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాక కేంద్రం నుంచి నిధులు కూడా రావన్నారు. సమగ్రశిక్షా పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన రూ.2,152 కోట్లలో మొదటి విడతగా రూ.573 కోట్లు కావాల్సివుండగా, అవి ఇంకా విడదల కాలేదన్నారు. ఒక విద్యార్థి నిర్దిష్ట భాషను నేర్చుకోవాలనుకుంటే దానికి ప్రభుత్వం ఎందుకు అభ్యంతరం చెబుతోందని ప్రశ్నించారు. విద్యారంగంలో రాజకీయాలు చేయవద్దని సీఎంకే రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వర్షాలకు ముందే సహాయ శిబిరాలు సిద్ధం

- మంత్రి కేఎన్ నెహ్రూ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నెహ్రూ

ప్యారీస్, ఆగస్టు 28: ఈశాన్య రుతుపవనాల ప్రారంభానికి ముందే వాతావరణంలో మార్పుల కారణంగా పలు చోట్ల భారీవర్షాలు కురుస్తున్నాయని, ఈ వర్షాలు ముమ్మరం కాకముందే ముందస్తు చర్యలు చేపట్టాలని నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ సంబంధిత అధికారులను ఆదేశించారు. చేపాక్కంలోని ఈ శాఖ ప్రధాన కార్యాలయంలో మంత్రి నెహ్రూ అధ్యక్షతన బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో అదనపు ప్రధాన కార్యదర్శి, జల వనరుల శాఖ, పురపాలకశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఈశాన్య రుతుపవనాల ముందు జాగ్రత్త చర్యలపై మంత్రి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వర్షాలు ప్రారంభం కాకముందే డ్రైనేజీలో పూడికతీత పనులు పూర్తిచేయాలని, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా, వర్షాకాలంలో నీరు వృధా కాకుండా సంరక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, డ్రైనేజీల్లో వర్షపు నీరు ప్రవహించేలా వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను కాపాడే విధంగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేయాలని, చెరువులు, వాగుల సమీపంలో నివసించే వారిని నివారణ కేంద్రాలకు తరలించి వారికి ఆహారం, వైద్య సదుపాయాలు కల్పించాలని మంత్రి నెహ్రూ ఆదేశించారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

- రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఎంపిక

ఐసిఎఫ్, ఆగస్టు 28: కేంద్ర ప్రభుత్వం అందజేసే జాతీయ ఉపాధ్యాయ పురస్కారానికి రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. దివంగత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి రోజైన సెప్టెంబరు 5వ తేది 'జాతీయ టీచర్స్ డే'గా జరుపుకుంటున్నారు. దీనిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 50 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి పురస్కారాలు అందజేస్తోంది. ఈ ఏడాది ఎంపికైన వారిలో రాష్ట్రానికి సంబంధించి వేలూరు జిల్లా రాజకుప్పం పంచాయతి యూనియన్ మాధ్యమిక పాఠశాల ఉపాధ్యాయులు గోపినాథ్, మదురై డీవీఎస్ మహోన్నత పాఠశాల ఉపాధ్యాయులు మురళీధరన్ ఉన్నారు. వీరికి ఢిల్లీలో సెప్టెంబరు 5వ తేది జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, రూ.50,000 నగదు బహుమతి, వెండి పతకం, ప్రశంసాపత్రం అందజేయనున్నారు.

స్టాలిన్ విమానానికి బాంబు బెదిరింపు

- రాత్రంతా భద్రతా విభాగం అధికారుల జాగారం
- ముమ్మరంగా కొనసాగిన తనిఖీలు



చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి స్టాలిన్, ఆయన సతీమణి దుర్గ, అధికారులు దుబాయ్ వెళ్తున్న విమానానికి బాంబు బెదిరింపు రావటంతో భద్రతాదళం అధికారులు, సిబ్బంది రాత్రంతా తనిఖీలతో జాగారం చేశారు. ఈమెయిల్‌లో వచ్చిన ఈ బాంబు బెదిరింపు సమాచారం స్టాలిన్ వెళ్లే ఎమిరేట్స్ విమానం బయలుదేరిన రెండు గంటల తర్వాత విమానాశ్రయ అధికారులకు తెలిసింది. దీంతో విమానాశ్రయ అధికారులు విమానంలో ఉన్న ముఖ్యమంత్రి భద్రతా విభాగం అధికారులకు సమాచారం అందించారు. స్టాలిన్ ప్రయాణించిన విమానానికే కాకుండా చెన్నై విమానాశ్రయానికి కూడా ఈమెయిల్‌లో బాంబు బెదిరింపులు రావటంతో చెన్నై విమానాశ్రయంలో తనిఖీలు చేశారు. అమెరికా పర్యటన కోసం స్టాలిన్, ఆయన సతీమణి దుర్గాస్టాలిన్, అధికారులు మంగళవారం రాత్రి 8.40 గంటలకే మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్నారు. సీఎం అధికారిక పర్యటన ప్రకారం చెన్నై నుంచి ఎమిరేట్స్ విమానంలో దుబాయ్ వెళ్లి, అక్కడి నుండి మరో విమానంలో అమెరికా వెళ్ళాల్సి ఉంది. రాత్రి 10.16 గంటలకు బయలుదేరిన ఎమిరేట్స్ విమానంలో స్టాలిన్, సతీమణి, అధికారులు ప్రయాణించారు. ఆ విమానం బయలుదేరిన అరగంట తర్వాత బాంబు బెదిరింపు వచ్చిన విషయం తెలుసుకుని అధికారులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మంగళవారం రాత్రి 7.55 గంటలకు సీఎం స్టాలిన్ మీనంబాక్కం ఎయిర్‌పోర్ట్‌కు రాకముందే విమానాశ్రయ డైరెక్టర్‌కు స్టాలిన్ ప్రయాణించనున్న విమానంలో, విమానాశ్రయంలో బాంబులు పేలుతాయని గుర్తు తెలియని వ్యక్తి ఈమెయిల్ చేశాడు. ఈ సందేశాన్ని రాత్రి 10 గంటల సమయంలోనే అధికారులు గుర్తించారు. అప్పటికే స్టాలిన్ ప్రయాణిస్తున్న ఎమిరేట్స్ విమానం చాలా దూరం వెళ్లింది. దీంతో ఆ విమానం దుబాయ్ చేరుకునేంత వరకూ విమానాశ్రయం ఉన్నతాధికారులు తీవ్ర ఆందోళన చెందారు. బుధవారం వేకువజాము దుబాయ్‌లో ఆ విమానం దిగిన తరువాత అక్కడి బాంబ్‌స్క్వాడ్ క్షుణ్ణంగా తనిఖీ చేసి బాంబులు లేవని నిర్ధారించారు. ఆ తర్వాతే అటు సీఎం సెక్యూరిటీ, ఇటు విమానాశ్రయంలోని కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.





కొత్త బస్సులకు జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి

ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థకు రూ.90.52 కోట్లతో 150 బస్సులు

ప్రారంభించిన మంత్రి ఉదయనిధి

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థలో రూ.90.52 కోట్లతో కొత్తగా కొనుగోలు చేసిన 105 బస్సులను రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి బుధవారం ఉదయం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థలో స్లీపర్ సదుపాయం కలిగిన 200 కొత్త బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించగా, తొలివిడతగా 150 కొత్త బస్సులను ప్రారంభించారు. పల్లవన్‌శాలైలోని సెంట్రల్ వర్క్‌షాపులో జరిగిన కార్యక్రమంలో ఈ బస్సులను మంత్రి ప్రారంభించారు. కొన్ని బస్సుల్లో ప్రయాణికులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి శివశంకర్, హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, ఎంపీలు దయానిధి మారన్, ఎం.షణ్ముగం, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్, రవాణా శాఖ కార్యదర్శి కె.ఫణీందర్ రెడ్డి, మహానగర రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆల్బీజాన్ వర్గీస్, ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్ మోహన్, మహానగర రవాణా సంస్థ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. నటరాజన్, తొళిలాలర్ మున్నేట్ర సంఘం కోశాధికారి కె.నటరాజన్ తదితరులు పాల్గొన్నారు. కొత్తగా ప్రారంభించిన ఈ బస్సుల్లో దివ్యాంగులు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు శ్రమలేకుండా ప్రయాణించేలా వసతులు కల్పించినట్లు రవాణా శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఈ బస్సుల్లో ముందువైపు చక్రాల వద్ద ఎయిర్ సస్పెన్షన్ సదుపాయం కల్పించినట్లు చెప్పారు. చిన్నారులు, వృద్ధులకు 50 బస్సుల్లో లోయర్ బెర్త్‌లు ఏర్పాటుచేశామని, వీటి నడుమ ఎక్కువ ఖాళీ స్థలం కూడా ఉందని వివరించారు. ప్రతిసీటుకు, బెర్త్‌కు ఛార్జింగ్ బోర్డు, ఫ్యాన్, డిజిటల్ గడియారం తదితర వసతులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.

బంగాళాఖాతంలో నేడు అల్పపీడనం

రాష్ట్రానికి 3 రోజుల వర్షసూచన

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తూర్పు మధ్య ఉత్తర బంగాళాఖాతంలో గురువారం అల్పవాయుపీడనం ఏర్పడనుందని, దాని ప్రభావంతో మరో మూడు రోజులపాటు రాష్ట్రంలో, పుదుచ్చేరి తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు ప్రకటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ప్రభావంతో చెదురుముదురుగా వర్షాలు కురుస్తున్నాయని, ఈ అల్పపీడనం కారణంగా తీర ప్రాంతాల్లో పెనుగాలులు వీస్తాయని, సముద్రతీర జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. గురు, శుక్రవారాల్లో పుదుచ్చేరి, కారైక్కాల్ సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పెనుగాలులు వీస్తాయని భారత వాతావరణ విభాగం ప్రకటన జారీ చేసింది. ఇక రాజధాని నగరంలో చెన్నై మరో 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందని, నగరంలోను, పరిసర ప్రాంతాల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

కొత్త విద్యా విధానం ఆమోదించాలంటూ కేంద్రం ఒత్తిడి

- విద్యామంత్రి అన్బిల్ ఆరోపణ



అడయార్, ఆగస్టు 28: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రం ఒత్తిడి చేస్తోందని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ సంచలన ఆరోపణలు చేశారు. సమగ్ర సర్వశిక్షా అభియాన్ పథకం కింద రాష్ట్రానికి రావాల్సిన కేంద్రప్రభుత్వం వాటా రూ.573 కోట్లు విడుదల చేయలేదు. ఈ విషయంపై కేంద్రానికి లేఖ రాసినా ఎలాంటి స్పందన లేదంటూ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు బయటపెట్టారు. దీంతో కేంద్రం చర్యను ముఖ్యమంత్రి స్టాలిన్ తో పాటు ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి కూడా తీవ్రంగా ఖండించారు.. ఈ నేపథ్యంలో బుధవారం ఇదే అంశంపై మంత్రి అన్బిల్ మహేశ్ తిరుచ్చిలో మీడియాతో మాట్లాడారు. అందరికీ విద్యా విధానం పథకం కింద రాష్ట్రానికి కేంద్రం ఇవ్వాల్సిన రూ.573 కోట్లను ఇప్పటివరకు విడుదల చేయలేదన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి అమెరికా వెళ్ళకముందే కేంద్రంపై ఒత్తిడి తెచ్చారన్నారు. పార్లమెంట్‌లో ఎంపీ కనిమొళి సారథ్యంలో డీఎంకే ఎంపీల బృందం, తాను కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి విజ్ఞప్తి కూడా చేశామన్నారు. కానీ, జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తేనే ఈ నిధులను విడుదల చేస్తామంటూ తమపై ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. కొత్త విద్యా విధానానికి, నిధుల విడుదలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. నూతన జాతీయ విద్యా విధానం గత 2020 నుంచి అమలు చేస్తున్నారన్నారు. కానీ, సమగ్ర సర్వశిక్షా అభియాన్ పథకం గత 2018లోనే అమల్లోకి వచ్చిందని మంత్రి గుర్తు చేశారు. పైగా కొత్త జాతీయ విద్యా విధానానికి ఆమోదం తెలుపాలంటూ రాష్ట్రంపై కేంద్రం ఒత్తిడి తెస్తూనే ఉందన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ త్రిభాషా విద్యావిధానానికి రాష్ట్రం ఆమోదించే ప్రసక్తే లేదన్నారు. కేంద్రం నిధులు విడుదల చేయకపోవడంతో ఏర్పడిన నిధుల లేమిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ వివిధ మార్గాలను అన్వేషిస్తున్నారన్నారు. సమగ్ర సర్వశిక్షా అభియాన్ పథకం కింద పని చేసే ఉపాధ్యాయులకు వేతనాలు, ఇతర ఖర్చులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి అన్బిల్ మహేష్ వెల్లడించారు.



గుంతలో పడిన సరుకు ఆటో

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మహిళల మృతి

పెరంబూర్, ఆగస్టు 28: తెన్‌కాశి జిల్లా సురండై వద్ద సరుకు ఆటో బోల్తాపడిన ఘటనలో ముగ్గురు మహిళలు మృతిచెందగా, పదిమందికి గాయలయ్యాయి. తిరుచ్చిత్రంపల్లం గ్రామానికి చెందిన పదిమందికి పైగా వ్యవసాయ కార్మికులు వాడియూరు గ్రామంలో పొలం పనులకు బుధవారం ఉదయం సరుకు ఆటోలో బయల్దేరారు. కీల్‌సురండై ప్రాంతానికి చెందిన దేవేంద్రన్ (25) ఆటో నడిపాడు. వాడియూర్ గ్రామ సమీపంలో వేగంగా వెళుతున్న ఆటో మలుపు తిరిగే సమయంలో అదుపుతప్పి రోడ్డుపక్కన గుంతలో పడింది. ఈ ఘటనలో జానకి (52), వెల్లియమ్మాళ్ (60), పిచ్చమ్మాళ్ (60) అనే ముగ్గురు మహిళలు సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటనలో డ్రైవర్ సహా మరో 10 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సురండై పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తెన్‌కాశి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. వారిలో డ్రైవర్ దేవేంద్రన్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మృతదేహాలను తెన్‌కాశి జిల్లా ప్రధాన ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సమాచార దర్శిని

8న భావనారాయణ శతజయంతి సభ

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 'చెన్నపురి తెలుగు అకాడమీ' ఆధ్వర్యంలో సెప్టెంబరు 8వ తేదీన 'భారవి' సినిమా రచయిత చిల్లర భావనారాయణరావు శతజయంతి ప్రారంభోత్సవ సభ జరుగనుంది. ఉదయం 10.30 గంటలకు మైలాపూర్‌లో ఉన్న భారతీయ విద్యా భవన్ మినీహాలులో జరుగనున్న ఈ కార్యక్రమం ప్రముఖ గాయకుడు కిడాంబి లక్ష్మీకాంత్ ప్రార్థనాగీతంతో ప్రారంభం కానుండగా, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కవయిత్రి డాక్టర్ చిల్లర భవానీ దేవి ముఖ్య అతిథిగా, ఢిల్లీకి చెందిన ప్రముఖ న్యాయవాది కమలాకర ఆనంద శివరామ్ విశిష్ట అతిథిగా, భావనారాయణరావు కుమారుడు చిల్లర కళాధర్ ఆత్మీయ అతిథిగా హాజరు కానున్నారు. ఈ కార్యక్రమానికి సాహితీ, సంస్కృతి ప్రియులందరూ ఆహ్వానితులేనని సంస్థ మేనేజిగ్ ట్రస్టీ డాక్టర్ తూమాటి సంజీవరావు, కార్యదర్శి తిరునగరి భాస్కర్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

సహకార శాఖ కొత్త యాప్

ఐసిఎఫ్, ఆగస్టు 28: 'కూట్టురవు' పేరుతో కొత్త యాప్‌ను సహకార శాఖ పరిచయం చేసింది. వివిధ సహకార సంఘాలందించే సేవలను ప్రజలు, సంఘ సభ్యులు తెలుసుకొనేలా ఈ యాప్‌ను రూపొందించి విడుదల చేశారు. సమాచారం మాత్రమే కాకుండా రుణాలు పొందేందుకు దరఖాస్తులు కూడా ఈ యాప్ ద్వారా చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

1 నుంచి పనిచేయనున్న ధాన్యం కేంద్రాలు

ఐసిఎఫ్, ఆగస్టు 28: ధాన్యం కొనుగోలు కేంద్రాలు సెప్టెంబరు 1వ తేది నుంచి పనిచేస్తాయని ఆహార శాఖ అధికారులు తెలిపారు. ఒక్కో జిల్లాలో అవసరమయ్యే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ఈ శాఖ చర్యలు చేపట్టింది. ఆ ప్రకారం ఏర్పాటైన ఈ కేంద్రాలు సెప్టెంబరు 1వ తేది ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరామని, అనుమతి లభించిన తర్వాత ఆ రోజు నుంచి పనిచేస్తాయని అధికారులు తెలిపారు.

14 మంది తహసీల్దార్ల బదిలీ

ఐసిఎఫ్, ఆగస్టు 28: నగరంలో 14 మంది తహసీల్దార్లు బదిలీ అయ్యారు. మధురవాయల్, తిరువొత్తియూర్, షోలింగనల్లూర్, పురుషవాక్కం, పెరంబూర్, ఎగ్మూర్ తాలూకా కార్యాలయాలు, కార్పొరేషన్, మెట్రోవాటర్ బోర్డు, టాస్మాక్ వంటి శాఖల్లో పనిచేస్తున్న 14 మంది తహసీల్దార్లు, 8 మంది డిప్యూటీ తహసీల్దార్లు బదిలీ అయ్యారు.

ఎగ్మూర్ మ్యూజియం వేళల్లో మార్పులు

ఐసిఎఫ్, ఆగస్టు 28: స్థానిక ఎగ్మూర్ మ్యూజియం సందర్శన వేళల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ విషయమై మంత్రి స్వామినాథన్ మాట్లాడుతూ... మ్యూజియానికి వచ్చే పర్యాటకుల సంఖ్య 15 శాతం పెరిగిందన్నారు. అలాగే, పర్యాటకుల సౌకర్యార్థం మ్యూజయం సందర్శన వేళల్లో మార్పులు చేపట్టామన్నారు. ఆ ప్రకారం, ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు మ్యూజియాన్ని సందర్శించవచ్చని తెలిపారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, ఆగస్టు 28: స్థానిక షోలింగనల్లూర్‌లో విద్యుత్ గ్రీవెన్స్ గురువారం ఉదయం 11 గంటలకు జరుగనుంది. ఈ మండల పరిధిలోని పెరుంబాక్కం చేరన్ నగర్‌లో ఉన్న ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలో జరిగే గ్రీవెన్స్‌లో, మేడవాక్కం, నన్‌మంగళం, జల్లడియన్ పేట, గౌరివాక్కం, పళ్లికరనై, కోవిలంబాక్కం, ఎస్.కొళత్తూర్, నారాయణపురం, చిట్లపాక్కం, అరసన్‌కలని, పెరుంబాక్కం ప్రాంతాలకు చెందిన వినియోగదారులు పాల్గొని తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

రాష్ట్రంలో పెరిగిన చేపల ఉత్పత్తి

ఐసిఎఫ్, ఆగస్టు 28: రాష్ట్రంలో 2020-21లో 7.23 లక్షల టన్నులున్న చేపల ఉత్పత్తి, 2023-24లో 8.84 లక్షల టన్నులకు చేరినట్లు అధికారులు తెలిపారు. కేంద్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద జాలర్ల అభివృద్ధి, చేపల ఉత్పత్తి పెంపునకు నిధులు కేటాయిస్తున్నారు. దీని కారణంగా రాష్ట్రంలో చేపల ఉత్పత్తి పెరిగిందని అధికారులు తెలిపారు.

రూ.85 కోట్లతో ఫుట్‌బాల్ మైదానం

ఐసిఎఫ్, ఆగస్టు 28: స్థానిక షోలింగనల్లూర్‌లో రూ.85 కోట్లతో ఫుట్‌బాల్ మైదానం ఏర్పాటుచేస్తున్నారు. షోలింగనల్లూర్ మండలం 199 వార్డులో ఆరెకరాల్లో ప్రభుత్వ మహోన్నత పాఠశాల ఉంది. అందులో ఖాళీ స్థలంలో ఫుట్‌బాల్ మైదానం, రన్నింగ్ రేస్‌కు ప్రత్యేక మార్గం ఏర్పాటుచేసేందుకు నిర్ణయించిన కార్పొరేషన్, రూ.85 కోట్లు కేటాయించింది. సెప్టెంబరులో ఈ రెండు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

మెరీనా, బీసెంట్ నగర్ బీచ్‌ల్లో పారిశుధ్యానికి టెండర్లు

ఐసిఎఫ్, ఆగస్టు 28: స్థానిక మెరీనా తీరం, బీసెంట్ నగర్ సముద్రతీరాల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు చెన్నై కార్పొరేషన్ తెలిపింది. కార్పొరేషన్ పరిధిలో ప్రతిరోజు వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు తొలగిస్తున్నారు.తిరువొత్తియూర్, మనలి, అంబత్తూర్‌లోని కొన్ని ప్రాంతాలు, తేనాంపేట,కోడంబాక్కం, వలసరవాక్కం, ఆలందూర్, అడయార్, పెరుంగుడి, షోలింగనల్లూర్ మండలాల్లో ఈ పనులను ప్రైవేటు సంస్థలకుఅప్పగించారు.ఈ నేపథ్యంలో మెరీనా, బీసెంట్ నగర్ సముద్రతీర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు త్వరలో టెండర్లు ఆహ్వానించనున్నామని కార్పొరేషన్ కమిషనర్ కుమరగురుపరన్ తెలిపారు.

రూ.5,000 కోట్లతో రహదారుల అభివృద్ధి

ఐసిఎఫ్, ఆగస్టు 28: రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.5,000 కోట్లు కేటాయించింది. మూడేళ్లలో 7,966 కి.మీ రహదారుల విస్తరణ, 1,841 వంతెనలు, చిన్న వంతెనల నిర్మాణపనులు రూ.14,980 కోట్లతో చేపట్టారు. ఇవి మినహా 5,715 కి.మీ రహదారులకు మరమ్మతులు జరిగాయి. ఈ ఏడాది 27 జిల్లాల్లో రహదారులఅభివృద్ధి, వంతెనల నిర్మాణాలకు రూ.5,000 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఒక్కో జిల్లాకు రూ.100 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు విభజించి పనులు చేపట్టనున్నట్లు రహదారుల శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

అక్టోబరులో బీచ్-ఎగ్మూర్ నాలుగో మార్గం

ఐసిఎఫ్, ఆగస్టు 28: చెన్నై బీచ్-ఎగ్మూర్ మధ్య జరుగుతున్న నాలుగో మార్గం పనులు పూర్తికావచ్చాయని, అక్టోబరులో రైళ్ల రాకపోకలు కొనసాగుతాయని చెన్నై రైల్వే డివిజన్ మేనేజర్ విశ్వనాథ్ తెలిపారు. ఎగ్మూర్-బీచ్ మధ్య ప్రస్తుతం మూడు రైల్వే మార్గాలుండగా, రెండింటిలో సబర్బన్ రైళ్లే, ఒక లైన్‌లో ఎక్స్‌ప్రెస్, గూడ్సు రైళ్లు నడుస్తున్నాయి. తాంబరం టెర్మినల్ నుంచి ఉత్తర రాష్ట్రాలకు అదనపు రైళ్లు నడిపేందుకు, సబర్బన్ రైళ్లను నిరంతరాయంగా నిర్వహించేలా నాలుగో మార్గం ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 4.3 కి.మీ దూరం రూ.279.8 కోట్ల వ్యయంతో గత ఏడాది ఆగస్టులో ప్రారంభమైన ఈ పనులు పూర్తికావచ్చాయి. అక్టోబరులో ఈ మార్గాన్ని ప్రారంభించి రైళ్లు నడపనున్నామని విశ్వనాథ్ తెలిపారు.

లంక నావికాదళం దాడులకు నిరసన

రామేశ్వరం జాలర్ల సమ్మె

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం దాడులు, జాలర్ల అక్రమ నిర్బంధాలను ఖండిస్తూ రామేశ్వరం మరపడవల జాలర్లు బుధవారం ఉదయం సమ్మె చేపట్టారు. రామేశ్వరం చేపలరేవు నుంచి మరియసియా అనే వ్యక్తికి చెందిన మరపడవలో కింగ్‌సన్, మెక్కన్స్, రాజ్, ఇన్నాసి రాజా, శశి, మారియప్పన్, అడిమై, మునియరాజ్ అనే ఎనిమిదిమంది జాలర్లు మంగళవారం వేకువ జాము చేపలు పడుతుండగా శ్రీలంక నావికాదళం చుట్టుముట్టి వారిపై దాడి చేసి నిర్బంధించి శ్రీలంక కాంగేశన్ ఓడరేవుకు తరలించింది. ఈ విషయం తెలియగానే రామేశ్వరం జాలర్ల సంఘం నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అరెస్టయిన జాలర్లను విడిపించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులను, అక్రమ నిర్బంధాలను ఖండిస్తూ రామేశ్వరంలోని మరపడవల జాలర్లు బుధవారం సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె కారణంగా రామేశ్వరం తీరంలో సుమారు 800లకు పైగా మరపడవలను లంగరేసి ఉంచారు. సుమారు మూడువేల మంది జాలర్లు సమ్మెలో పాల్గొన్నారు.



జాలర్ల సమ్మెకారణంగా రామేశ్వరం చేపలరేవు వద్ద లంగరేసి ఉంచిన మరపడవలు

కుంభకోణం ఆర్ట్స్ కళాశాలలో ఆగని ఆందోళన

● తాత్కాలికంగా మూసివేత

పెరంబూర్, ఆగస్టు 28: అధ్యాపకుడు తరగతి గదిలో ఓ విద్యార్థిని కులం పేరుతో దూషించాడని ఆరోపిస్తూ ఆరు రోజులుగా విద్యార్థులు తరగతులు బహిష్కరించి ఆందోళన చేపడుతున్న నేపథ్యంలో, కళాశాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ప్రకటించారు. కుంభకోణం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఓ అధ్యాపకుడు, విద్యార్థులను కులం పేరుతో ధూషించినట్లు ఈ నెల 8వ తేది విద్యార్థులు ఆందోళన చేపట్టారు. అనంతరం సదరు అధ్యాపకుడు సెలవుపై వెళ్లారు. ఆ అధ్యాపకుడిపై శాఖాపైరమైన చర్యలు చేపట్టి సస్పెండ్ చేయాలని కోరుతూ కళాశాల ప్రిన్సిపాల్‌కు విద్యార్థులు వినతిపత్రం సమర్పించారు. ఈ వ్యవహారంపై కళాశాల యజమాన్యం ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఈ నెల 19 నుంచి విద్యార్థులు తరగతులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. దీంతో, కళాశాలకు మూడు రోజులు సెలవులు ప్రకటించి, సోమవారం ప్రారంభించారు. అయినా, విద్యార్థులు తరగతులు బహిష్కరించి ఆందోనలు కొనసాగించారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కళాశాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు, పాఠశాల ప్రారంభం తేది తర్వాత ప్రకటిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ బుధవారం ప్రకటన విడుదల చేశారు.

పాఠశాలలో వర్షపునీటిని తొలగించాలి

వేలూరు, ఆగస్టు 28: గుడియాత్తం ప్రభుత్వ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిలిచిన వర్షపునీటిని సత్వరం తొలగించాలని స్థానిక ఎమ్మెల్యే అమ్ములు అధికారులను ఆదేశించారు. గుడియాత్తం, పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. దీంతో పాఠశాల ప్రాంగణంలో చేరిన నీటితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, వాననీటిని సత్వరం తొలగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపాలిటీ కమిషనర్ మంగైకరసన్, ఇంజనీర్ సంతప్, కౌన్సిలర్ మనోజ్ తదితరులున్నారు.



పాఠశాల ప్రాంగణంలో చేరిన నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అమ్ములు

300 ప్రకటనబోర్డుల తొలగింపు

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన 300 ప్రకటన బోర్డులను కార్పొరేషన్ అధికారులు తొలగించారు. గత రెండు రోజులుగా కార్పొరేషన్ కార్మికులను వెంటబెట్టుకుని అధికారులు నగరమంతటా పర్యటించి అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన బోర్డులను పోలీసుల భద్రత మధ్య తొలగించారు. ఇదే రీతిలో అన్ని జోన్లలోనూ అనుమతి లేని ప్రకటన బోర్డులను వరుసగా తొలగిస్తామని అధికారులు ప్రకటించారు.

రోడ్డుపై జెలిటిన్ స్టిక్స్

అడయార్, ఆగస్టు 28: రామనాథపురం జిల్లా తొండి, రామేశ్వరం బీచ్ రోడ్డుకు సమీపంలో జెలిటిన్ స్టిక్స్ చెల్లా చెదరుగాపడివుండడం గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ పట్టణం స్టేషన్ పోలీసులు మంగళవారం ఈ ప్రాంతంలో గస్తీ తిరుగుతున్న సమయంలో పాసిపట్టిణం సమీపంలోని రోడ్డులో జెలిటిన్ స్టిక్స్ పడివుండగా, ఇద్దరు వ్యక్తులు సేకరిస్తుండడం గమనించారు. వారు పోలీసులను చూడగానే పారిపోయారు. పోలీసులు జెలిటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకుని, పారిపోయిన వ్యక్తులు ఎవరు? జెలిటిన్ స్టిక్స్ ఎలా వచ్చాయన్న విషయంపై ఆరా తీస్తున్నారు.

స్నేహితుల ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

వేలూరు, ఆగస్టు 28: నగరంలో రోడ్డు పక్కన నివసించే పేదలకు స్నేహితుల ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం చేశారు. అనాథల సంక్షేమ పథక సెక్రటరీ మహమ్మద్ అమీన్ నేతృత్వంలో ట్రస్ట్ ఆర్గనైజర్లు మహమ్మద్ జాఫర్, సనావుల్లా, ఇలియాస్, మహమ్మద్ దావూత్, సయ్యద్ ఇంతియాజ్, అబ్దుల్ పారి, మహమ్మద్ ఆసిఫ్, బాలురు సయ్యద్ దాహీర్, మహమ్మద్ ఉమర్, మహమ్మద్ సఫ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్నట్రస్ట్ సభ్యులు

వినాయక చవితి ఏర్పాట్లపై సమావేశం

వేలూరు, ఆగస్టు 28: స్థానిక కాట్పాడి పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక చవితి ఏర్పాట్లపై బుధవారం సమీక్షా సమావేశం జరిగింది. కార్యక్రమంలో హిందు మున్నని సహా పలు హిందూ సంస్థలు పాల్గొన్నాయి. సమావేశంలో కాట్పాడి సీఐ మణికంఠన్, తిరువలమ్ ఎస్ఐ రామమూర్తి, ట్రైనీ ఎస్ఐ భరత్, ప్రత్యేక విభాగం పోలీసు గోపీనాథ్ పాల్గొని, వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి, వేదికల వద్ద చేపట్టాల్సిన చర్యలు, ఊరేగింపులో పాటించాల్సిన నిబంధనల గురించి వివరించారు.



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పాఠశాల ప్రాంగణాల్లో పచ్చదనం

వేలూరు, ఆగస్టు 28: పేర్నాంబట్టు ఇస్లామీయ ఉన్నత పాఠశాలలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. జిల్లా ప్రధాన విద్యాధికారి ఉత్తర్వులతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హుమయూన్ భాషా నేతృత్వంలో పాఠశాలప్రాంగణంలో 40 మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ ఆర్గనైజర్ జి.ఫైజల్ అహ్మద్, ఉప ప్రధానోపాధ్యాయులు ఆనందన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న దృశ్యం

ఓఎంఆర్‌లో నో ఎంట్రీ లోకి లారీలు వస్తే పెనాల్టీ

● ట్రాఫిక్ పోలీసుల వార్నింగ్

అడయార్, ఆగస్టు 28: పాత మహాబలిపురం రహదారి (ఓఎంఆర్)లో నిషేధిత ప్రాంతం (నో ఎంట్రీ)లోకి వచ్చే లారీలకు అపరాధం విధిస్తామని నగర ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. నో ఎంట్రీలోకి ప్రవేశించే లారీలకు తొలిసారి అపరాధం, రెండోసారి ఆ లారీ లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.

టోల్ ప్లాజా ఛార్జీల పెంపు ఉపసంహరించుకోవాలి : సీపీఎం

పెరంబూర్, ఆగస్టు 28: రాష్ట్రంలోని 25 టోల్ ప్లాజాల్లో సెప్టెంబరు 1 నుంచి ఛార్జీల పెంపు నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరిచుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం మంగళవారం టి.నగర్‌లోని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో జరిగింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ రాజకీయ నాయకత్వ కమిటీ సభ్యుడు జి.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు బి.సంతప్, యు.వాసుకి, పి.షణ్ముగం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో చేసిన తీర్మానాలపై రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్ మాట్లాడుతూ.. టోల్ ఛార్జీల పెంపుతో రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర సరకులు, ప్రాణాలు రక్షించే మందులు, కూరగాయల ధరలు పెరిగే అవకాశముందని, ఈ పెంపు సామాన్య, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం పడనుందని తెలిపారు. టోల్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడంతో పాటు కాలం చెల్లిన టోల్ గేట్లు తొలగించాలని సమావేశంలో తీర్మానించామని తెలిపారు. అలాగే, ఇటీవల పళనిలో జరిగిన ముత్తమిళ్ మురుగన్ మహానాడులో తీసుకున్న నిర్ణయాలకు సమావేశం ఖండించిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక విద్యా విధానాన్ని ప్రకటించి దాని కోసం నిపుణుల కమిటీ ఏర్పాటుచేసి, ఆ కమిటీ సిఫార్సులను పరిగణలోని తీసుకోవాలని కోరుతున్నామన్నారు. శాస్త్రీయ ఆలోచనలకు వ్యతిరేకంగా విద్యార్థుల్లో మతం ప్రాతిపదికతో కూడిన విద్య అందించే చర్యలు మానుకోవాలని సమావేశంలో తీర్మానించినట్లు బాలకృష్ణన్ తెలిపారు.

కీళడిలో బయల్పడిన ప్రాచీన పైప్ లైన్

ఐసిఎఫ్, ఆగస్టు 28: కీళడిలో చేపట్టిన తవ్వకాల్లో ప్రాచీన కాలం నాటి పైప్ లైన్లు బయల్పడ్డాయి. రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో 10వ విడత తవ్వకాలు జరుగుతున్నాయి. ఇదివరకే వివిధ రకాల వస్తువులు లభించగా, మంగళవారం చేపట్టిన తవ్వకాల్లో ఒక్కొక్కటి 174 సెం.మీ పొడవు కలిగి బంకమట్టితో తయారుచేసిన ఆరు పైపులు ఒకదానికొకటి అనుసంధానం చేసిన విధానంలో బయల్పడ్డాయి. ఈ ప్రాచీన పైప్ లైన్ విధానం ఏ కాలానికి సంబంధించిందో ఇంకా తెలియలేదని, పరిశోధనల అనంతరం వెల్లడిస్తామని పురావస్తు శాఖ అధికారులు తెలిపారు.



కీళడి తవ్వకాల్లో బయల్పడిన బంకమట్టి గొట్టాలు

డివిజన్‌స్థాయి అథ్లెటిక్ పోటీలు ప్రారంభం

వేలూరు, ఆగస్టు 28: వేలూరు డివిజన్ స్థాయి బాలికల అథ్లెటిక్ పోటీలు బుధవారం ప్రారంభయ్యాయి. కృష్ణస్వామి మొదలియార్ సీనియర్ సెకండరీ పాఠశాల మైదానంలో జరిగిన ఈ పోటీలను పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్ ఒలింపిక్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో అరియూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నందకుమార్, వ్యాయామోపాధ్యాయుడు సతీష్‌కుమార్, రోటరీ అధ్యక్షుడు సెల్వం, ఎయిల్‌అరసన్, మహాదేవన్, హరినాధన్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఒలింపిక్ జ్యోతి వెలిగిస్తున్న శివకుమార్

25కు విజయభాస్కర్ అక్రమాస్తుల కేసు వాయిదా

అడయార్, ఆగస్టు 28: అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి సి.విజయభాస్కర్‌పై నమోదైన అక్రమాస్తుల కేసు విచారణ సెప్టెంబరు 25వ తేదీకి వాయిదాపడింది. పుదుక్కోట జిల్లా ఇలుంబుయూర్‌కు చెందిన విజయభాస్కర్ ఆ జిల్లా అన్నాడీఎంకే కార్యదర్శిగా, గత అన్నాడీఎంకే ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. అయితే, ఈయన ఆదాయానికి మించి రూ.35.79 కోట్ల మేర ఆస్తులు కూడబెట్టుకున్నారంటూ పుదుక్కోట జిల్లా అవినీతి నిరోధక శాఖ అధికారులు 2021 అక్టోబరు 17వ తేదీ కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ పుదుక్కోట జిల్లా ప్రధాన జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో సాగుతుంది. ఈ కేసులో ఇప్పటివరకు విజయ్ భాస్కర్ ఆరుసార్లు, రెండుసార్లు ఆయన భార్య రమ్యతో కలిసి, 11సార్లు ఆయన తరపు న్యాయవాదులు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో 18వ దఫా ఈ కేసు విచారణకు రాగా, విజయ్‌భాస్కర్, రమ్య విజయభాస్కర్, న్యాయవాదులు హాజరయ్యారు. దీంతో ఈ కేసుల విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేశారు.

డీఎంకే పాలనలో దేవాలయాలకు పూర్వవైభవం

● రెండు వేలకు పెరిగిన కుంభాభిషేకాలు

● రేపు విరాటేశ్వరర్ ఆలయ కుంభాభిషేకం

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాచీన, సుప్రసిద్ధ ఆలయాలన్నీ కొత్త మెరుగులు సంతరించుకున్నాయని, గత 39 నెలల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 1999 ఆలయాలకు మహాకుంభాభిషేకాలు నిర్వహించామని దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రకటించారు. శుక్రవారం ఉదయం ధర్మపురం ఆధీనం నిర్వహణలో ఉన్న తిరుక్కడయూరు అమృతఘటేశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న విరాటేశ్వరర్ ఆలయానికి జరుగనున్న మహాకుంభాభిషేకంతో ఇప్పటివరకూ దేవాదాయశాఖ నిర్వహించిన ఆలయ కుంభాభిషేకాల సంఖ్య 2 వేలకు చేరనుందని పేర్కొన్నారు. డీఎంకే పాలనలోనే వందేళ్లకు పైబడి కుంభాభిషేకాలకు నోచుకోని ఆలయాలన్నింటికి కుంభాభిషేకాలు జరిపిన ఘనత డీఎంకే ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు.



మహిళలు, బాలికలపై అధికమవుతున్న లైంగిక వేధింపులు, అత్యాచార ఘటనలు అడ్డుకొనేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతూ వేలూరు అన్నాసాలైలోని ఆడిటోరియం సమీపంలో బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో పాల్గొన్న ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి ధనలక్ష్మి, కోశాధికారి జ్ఞానసౌందరి, కార్యకర్తలు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఆగస్టు 28: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తాంబరం: కృష్ణా నగర్, వెట్రి నగర్, సుభాష్ నగర్, కృష్ణా నగర్ 1 నుంచి 8 వీధులు, రమణి నగర్, మల్లికా నగర్, కుమరన్ నగర్, సరస్వతి నగర్, పార్వతి నగర్, శ్రీరామ్ నగర్ నార్త్, సౌత్, బాలకృష్ణా నగర్, ముడిచూర్ రోడ్డు, పాత పెరుంగళత్తూర్, కడప్పేరి. **దురైపాక్కం:** బిడారిఅరియాత్తమ్మన్ ఆలయ వీధి, గంగయమ్మన్ ఆలయ వీధి, ఈశ్వరన్ ఆలయ వీధి, తిరువళ్లువర్ వీధి, నేతాజి వీధి, పిల్లయార్ ఆలయ వీధి, వివేకానంద వీధి, ఓఎంఆర్, ఒగ్గియంపేట, మేట్టుకుప్పం పిల్లయార్ ఆలయ వీధి. **కడప్పేరి:** ఎంవీఎస్ రోడ్డు, కన్నన్ వీధి, యాదవాల్ వీధి, ఎల్ఐ వీధి, జీఎస్‌టీ రోడ్డు, రంగా వీధి, జయా వీధి, రాజగోపాల్ వీధి, శ్రీనివాస్ వీధి, థామస్ వీధి, నార్త్ టాంక్‌బండ్ రోడ్డు, సౌత్ టాంక్‌బండ్ రోడ్డు, జానకియమ్మాళ్ వీధి, తిరువికనగర్ 1 నుంచి 3 వీధులు, ఆర్వీ గార్డన్

ఆర్కే నగర్: ఎస్పి ఆలయ వీధి, తిలగర్ నగర్, ఆర్కే నగర్, ఇలయముదలి వీధి, వావూసీ నగర్, మింట్, కల్ మండపం, తిరువొత్తియూర్ హైరోడ్డు, కామరాజర్ కాలని, పెరుమాళ్ ఆలయ గార్డన్, ఆరణి రంగన్ వీధి, తిరునావుక్కరసు గార్డన్, కోదండరామర్ వీధి, బసవయ్యన్ వీధి, టీహెచ్ రోడ్డు, స్టాన్లీ ఏరియా, త్యాగప్పన్ వీధి, టోల్‌గేట్ ఏరియా, కన్నికోయిల్ వీధి

పెరుంగుడి: సీబీఐ కాలని, రామప్ప నగర్, పిల్లయార్ ఆలయ వీధి, కురింజినగర్, రాజ్యలక్ష్మి అవెన్యూ, కామరాజ్ నగర్, వీరాస్వామి రోడ్డు, టెలిఫోన్ నగర్.

అన్నామలైకు వ్యతిరేకంగా అన్నాడీఎంకే ధర్నా

వేలూరు, ఆగస్టు 28: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆ పార్టీ కార్యకర్తలు బుధవారం గుడియాత్తంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. వేలూరు నగర జిల్లా అన్నాడీఎంకే సెక్రటరీ వేల్‌అయగన్ నేతృత్వంలో జరిగిన నిరసనలో, గుడియాత్తం నగర సెక్రటరీ జీకేవీ పళని, కాట్పాడి తాలూకా సెక్రటరీ రాము, పేర్నాంబట్టు సెక్రటరీ నటరాజన్, విరింజిపురం సెక్రటరీ కలైసెల్వం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నామలైకు వ్యతిరేకంగా నినాదాలు చేసిన కార్యకర్తలు, ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.



నిరసన కార్యక్రమంలో అన్నాడీఎంకే శ్రేణులు

అంబత్తూరులో అన్నామలై దిష్టిబొమ్మ దహనం

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి కీర్తి ప్రతిష్ఠలను కించపరిచేలా విమర్శలు చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకి వ్యతిరేకంగా అంబత్తూరులో ఆయన దిష్టిబొమ్మను తగులబెట్టారు. ఈ ఆందోళనలో పాల్గొన్న సుమారు వందమందిని పోలీసులు అరెస్టు చేశారు. అంబత్తూరు ఓటీ బస్టాండు వద్ద అన్నామలై దిష్టిబొమ్మను తగులబెట్టారు. ఎంజీఆర్ మండ్రం డిప్యూటీ కార్యదర్శి లిత్తో జే మోహన్ ఆందోళనకు నాయకత్వం వహించారు.

నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు

ఐసిఎఫ్, ఆగస్టు 28: కేంద్ర ప్రభుత్వం నిషేధించిన మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర మందుల నాణ్యత నిర్ధారణ డైరెక్టరేట్ హెచ్చరించింది. రెండు లేక అంతకు పైగా మందుల మిశ్రమాన్ని కలిగిన మందుల రకాల దేశవ్యాప్తంగా విక్రయిస్తున్నారు. వీటి పనితీరు, సైడ్ ఎఫెక్ట్ గురించి మందుల నాణ్యత నిర్ధారణ బోర్డు తనిఖీచేసి, ఆ వివరాలు విడుదల చేశాయి. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో జలుబు, దగ్గు, విటమిన్ మాత్రలు, గుండె, కాలేయ వ్యాధులకు సంబంధించిన మాత్రలు ఇలా మొత్తం 156 రకాల మందులు నాణ్యమైనవి కావని ప్రకటిస్తూ వాటిని నిషేధించాయి. ఈ మందులను అక్టోబరు 22వ తేది నుంచి ఎవరూ విక్రయించరాదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని అధికారులు హెచ్చరించారు.

రిటైర్డ్ మహిళా సీఐ హత్యకేసు...

ఎండీఎంకే జిల్లా కార్యదర్శి అరెస్టు

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కాంచీపురంలో రిటైర్డ్ మహిళా సీఐ హత్య కేసులో ఎండీఎంకే జిల్లా కార్యదర్శిని పోలీసులు అరెస్టు చేశారు. కాంచీపురం కార్పొరేషన్ కాలెండర్ వీధిలో కస్తూరి (62) అనే పదవీ విరమణ చేసిన సీఐ నివసిస్తున్నారు. 35 యేళ్ల వయస్సుల ఆమె మనస్పర్థల కారణంగా భర్తను విడిచి ఒంటరిగా జీవిస్తున్నారు. ఆమె కుమారుడు ఉత్తరాది రాష్ట్రంలో పనిచేస్తున్నారు. కస్తూరి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. కాంచీపురానికి చెందిన ఎండీఎంకే జిల్లా కార్యదర్శి వళయాపతి (65) రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో ఆమెకు సాయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22న కస్తూరి తన ఇంటిలో అనుమానస్పదరీతిలో శవంగా పడి ఉండగా పోలీసులు కనుగొన్నారు. ఈ సంఘటన జరిగిన తర్వాత వళయాపతి పరారయ్యాడు. దీంతో కస్తూరి హత్యతో వళయాపతికి సంబంధం ఉంటుందని అనుమానించిన పోలీసులు ఆయన ఆచూకీ కోసం గాలించారు. మంగళవారం రాత్రి వళయాపతి కుటుంబ సభ్యులతో కలిసి కారులో కాంచీపురం వెళ్తుండగా కరుక్కుపేట ప్రాంతం వద్ద శివకాంచీపురం పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఉదయం కోర్టులో ఆయనను హాజరుపరచి జైలుకు పంపారు. ఈ హత్యకేసుతో సంబంధం ఉన్న వళయాపతి స్నేహితుడు ప్రభు (52) ఆచూకీ కోసం గాలిస్తున్నారు.



హత్యకు గురైన కస్తూరి (ఫైల్‌ఫొటో) - అరెస్టయిన వళయాపతి

రూ.12.5 కోట్ల స్థలం స్వాధీనం

ఐసిఎఫ్, ఆగస్టు 28: స్థానిక కోట్టూరుపురంలో రూ.12.5 కోట్ల విలువైన స్థలాన్ని జలవనరుల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కోట్టూరుపురం చిత్రా నగర్‌లో అడయార్ నదీతీరాన్ని ఆనుకొని రెండు గ్రౌండ్ల స్థలాన్ని అదే ప్రాంతానికి చెందిన రవి అనే వ్యక్తి ఆక్రమించి శీతలపానీయాల కర్మాగారం నడుపుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు, కర్మాగారాన్ని తొలగించాలని వారం రోజుల క్రితం నోటీసులు పంపారు. అధికారుల ఆదేశాలు ఉల్లంఘించడంతో మంగళవారం సాయంత్రం ఆక్రమణలు తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

నకిలీ ఓటరు కార్డుల తయారి: వ్యక్తి అరెస్ట్

ఐసిఎఫ్, ఆగస్టు 28: పెరంబలూరు జిల్లాలో నకిలీ ఓటరు కార్డులు తయారుచేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. లబ్బైకుడికాడు ప్రాంతానికి చెందిన మహమ్మద్ సమీమ్ అబూబకర్ వీధిలో కంప్యూటర్ సెంటర్ నడుపుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మహమ్మద్ సాజిత్ అనే యువకుడు ఓటరు గుర్తింపుకార్డు కోసం ఈ సెంటర్‌కు వచ్చాడు. రూ.250 తీసుకొని ఓటరు గుర్తింపుకార్డు చేసి ఇచ్చాడు. ఆ కార్డుతో సాజిత్ పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. పోలీసుల విచారణలో, ఆ ఓటరు కార్డు నకిలీదని తెలిసింది. దీనిపై పోలీసులు విచారణ చేపట్టగా, మహమ్మద్ సమీమ్ అనేక మందికి నకిలీ ఓటరు కార్డులు తయారుచేసి ఇచ్చినట్లు తెలియడంతో అతడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

ఖడ్గమృగం కొమ్ము విక్రయించిన ఐదుగురి అరెస్ట్

ఐసిఎఫ్, ఆగస్టు 28: కుంభకోణం సమీపంలో ఖడ్గమృగం కొమ్ము విక్రయించిన ఐదుగురిని అటవీ శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలోని తిరునాగేశ్వరం లాడ్జిలో ఖడ్గమృగం కొమ్ము విక్రయంపై బేరాలు జరుగుతున్నట్లు చెన్నై, రామనాధపురంలో ఉన్న అటవీ, వన్యమృగాల నేరాల నియంత్రణ కేంద్రానికి సమాచారం అందింది. కుంభకోణం అటవీ శాఖ అధికారులు సోమవారం రాత్రి లాడ్జిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రూ.20 లక్షల విలువైన కొమ్ము స్వాధీనం చేసుకొని, మాజీ నావికాదళం అధికారి కలియపెరుమాళ్, ఖాజామైదీన్, తెన్నరసన్, విజయకుమార్ సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు.

కోయంబేడు రౌడీ అరెస్టు

అడయార్, ఆగస్టు 28: నగర శివారు ప్రాంతమైన సెమ్మంజేరిలో దాగివున్న కోయంబేడు ప్రాంతానికి చెందిన ధనంచెళియన్ (42) అనే రౌడీని పోలీసులు అరెస్టు చేశారు. స్థానికంగా పేరుమోసిన రౌడీగా గుర్తింపు పొందగా, రెండు హత్య, హత్యాయత్నం, దారిదోపిడీల సహా మొత్తం ఎనిమిదికి పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆరు నెలల క్రితం హత్యాయత్నం కేసుతో సంబంధం ఉండటంతో కోయంబేడు పోలీసులు గాలిస్తుండటంతో అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. ఈ నేపథ్యంలో ఈయన నగర శివారు ప్రాంతమైన సెమ్మంజేరిలో దాగిఉన్నాడనే సమాచారంతో అక్కడకు వెళ్ళిన పోలీసులు చుట్టుముట్టి అరెస్టు చేసి కోయంబేడు తీసుకొచ్చారు. ఆ తర్వాత కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

విద్యానిధుల నిలిపివేతపై

ఎంపీల మౌనం తగునా ?

● డీఎంకే కూటమిపై ఈపీఎస్ ధ్వజం

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విద్యానిధులు విడుదల చేయకపోవడంతో ఉపాధ్యాయులు జీతాలు పొందలేని దుస్థితి ఏర్పడిందని, ఇంత జరుగుతున్నా డీఎంకే, దాని మిత్రపక్షాలకు చెందిన ఎంపీలు మౌన వ్రతం పాటిస్తుండటం గర్హనీయమని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ డీఎంకే తన కూటమిలో 40 మంది ఎంపీలున్నా విద్యను రాష్ట్ర జాబితాలో మార్చేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకుండా, నీట్ వివాదంలా విద్యా విషయంలోనూ కపటనాటక మాడుతోందని విమర్శించారు. నీట్ రద్దు చేయిస్తామని యేళ్ల తరబడి రాష్ట్రానికి చెందిన విద్యార్థులందరినీ ముఖ్యమంత్రి స్టాలిన్ మోసగిస్తున్నారని, అదే విధంగా కేంద్రం ప్రవేశపెటిన నూతన విద్యావిధానాన్ని తీవ్ర వ్యతిరేకిస్తామని చెబుతున్న డీఎంకే విద్యను రాష్ట్ర జాబితాలోకి ఎలా మార్చగలదో ప్రజలకు వివరణ ఇవ్వాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు.



వేలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యాశాఖ నెలవారీ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి తదితరులు

సమాజంలోని సమకాలీన దుస్థితిని వివరించే 'పరారీ'

● వచ్చే నెలలో విడుదల


'పరారీ'లో హరిశంకర్, సంగీత కళ్యాణ్

కులం, భాష, మతం ఆధారంగా సమాజంలో జరుగుతున్న సమకాలీన దుస్థితిని వివరించేలా 'పరారీ' (ది మైగ్రెంట్) చిత్రాన్ని రూపొందించినట్టు ఆ చిత్ర దర్శకుడు ఎళిల్ పెరియవేది తెలిపారు. ప్రముఖ దర్శకుడు రాజు మురుగన్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన ఎళిల్ పెరియవేది సొంతంగా కథ సమకూర్చి డైరెక్ట్ చేశారు. ఎస్పీ సినిమాస్, కల ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఈ చిత్రం గురించి దర్శకుడు, ఎళిల్, హీరో హరిశంకర్, డీవోపీ శ్రీధర్ మంగళవారం రాత్రి నగరంలో మీడియాతో మాట్లాడుతూ, 'జీవనోపాధి కోసం తమ స్వస్థాలను వీడి మరో ప్రాంతానికి వలస వెళ్ళేవారిని వలసదారులు అంటారు. ఈ చిత్రంలో ఓ వర్గం ప్రజలు పొట్టకూటి కోసం సొంతూరు వదిలి కర్ణాటకకు వెళుతుంది. అందుకే టైటిల్‌ను 'పరారీ' (ది మైగ్రెంట్)గా పెట్టాం. ఈ వలసదారుల చుట్టూనే ఈ స్టోరీ కొనసాగుతుంది. తిరువణ్ణామలై జిల్లా పరిసర ప్రాంతాల్లో సాధారణ ప్రజల జీవనశైలి, వారి రాజకీయాలపై ఈ సినిమా మాట్లాడుతుంది. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం జాతి, కులమతాలను వాడుకుంటున్న మానవ సమాజాన్ని ప్రశ్నిస్తుంది. తిరువణ్ణామలైతో పాటు కృష్ణగిరి, బెంగళూరు ప్రాంతాల్లో 51 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేశాం. 'తోళర్ వెంకటేశన్' ఫేం హరిశంకర్ హీరోగా, కొత్త నటి సంగీత కళ్యాణ్ హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమాలో నటించిన ప్రతి ఒక్కరూ ఆరు నెలల పాటు ట్రైనింగ్ తీసుకున్నారు. వీరిలో అనేక మంది పీహెచ్‌డీ పట్టాదారులే. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్ట్స్, పుదుచ్చేరి యూనివర్శిటీ, ఢిల్లీ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, బెంగళూరు నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వంటి విద్యా సంస్థల్లో శిక్షణ పూర్తి చేశారు. ఇకపోతే, ఎన్నో అద్భుతమైన మెలోడీలను కంపోజ్ చేసిన షాన్ రోల్డాన్ ఈ సినిమాకు సంగీతం, ఉమాదేవి సాహిత్యం అందించారు. వచ్చే నెలలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. అన్ని అంశాలు కలగలిసిన పక్కా కమర్షియల్ మూవీగా తెరకెక్కించాం' అని వివరించారు.

పుదువై ఎల్జీని కలిసిన విజయ్ సేతుపతి


లెఫ్టినెంట్ గవర్నర్ కైలాసనాథన్‌తో విజయ్ సేతుపతి

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) కైలాసనాథన్‌ను ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పుదువై రాజ్ భవన్‌లో బుధవారం ఎల్జీని విజయ్ సేతుపతి ఎవరూ ఊహించని విధంగా కలుసుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన కైలాసనాథన్‌ను ఇటీవలే పుదుచ్చేరి ఎల్జీగా కేంద్రం నియమించిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో ఎల్జీని విజయ్ సేతుపతి కలుసుకోవడం ఆసక్తికరంగా మారింది. ఇదే విషయంపై రాజ్‌భవన్ వర్గాలను విచారించగా, ఒక సినిమా మీటింగులో పాల్గొనేందుకు విజయ్ సేతుపతి పుదువైకు వచ్చారని, ఆయన మర్యాదపూర్వకంగానే గవర్నర్‌ను కలుసుకున్నారని, ఆ సమయంలో వీరిద్దరు కొద్దిసేపు మాట్లాడుకున్నారని వెల్లడించాయి.



చిత్ర బృందాన్ని సన్మానిస్తున్న దృశ్యం

'పితా' చిత్ర బృందానికి అభినందనలు

చిత్రజ్యోతి

ఆదేష్ బాలా, శ్రీరామ్ చంద్రశేఖర్, రెహానా బేగం, మాస్టర్ దర్షిత్ తదితరులు నటించిన చిత్రం 'పితా'. ఇటీవల విడుదలై 25 రోజులుగా విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ముఖ్యంగా ఈ చిత్రాన్ని కేవలం 23 గంటల 23 నిమిషాల్లో చిత్రీకరణ పూర్తి చేయడం గమనార్హం. ఈ చిత్ర బృందానికి యునైటెడ్ ఆర్టిస్ట్ ఆఫ్ ఇండియా, మహా ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఇందులో ఆదేష్ బాలా, శ్రీరామ్, రెహానా, నిర్మాత శివరాజ్, దర్శకుడు డీఆర్ సుగన్‌కుమార్ తదితరులను ఆయా సంస్థల నిర్వాహకులైన డాక్టర్ అనురాధ, నెల్లై సౌందర్ రాజన్‌లు ప్రత్యేకంగా అభినందించి,సన్మాన పత్రాలను అందజేశారు. స్థానిక వడపళని, కుమరన్ కాలనీలోని శిఖరం హాలులో జరిగిన ఈ వేడుకలో ఆ చిత్ర యూనిట్ సభ్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

కొత్త ప్రాజెక్టుపై రేపు ప్రకటన

● ప్రియా అట్లీ



కోలీవుడ్ దర్శకుడు అట్లీ భార్య ప్రియా అట్లీ సొంతంగా ఏ ఫర్ యాపిల్ అనే నిర్మాణ సంస్థను నెలకొల్పగా, ఈ బ్యానరుపై నిర్మించే కొత్త ప్రాజెక్టు వివరాలను ఈ నెల 30వ తేదీ శుక్రవారం అధికారికంగా వెల్లడించనున్నట్టు ప్రకటించారు. ఇంతకుముందు 'సంగిలి పుంగిలి', 'కదవై తెర, 'అంధగారం' వంటి చిత్రాలను నిర్మించిన ప్రియా అట్లీ.. ఇపుడు బాలీవుడ్‌లో వరుణ్ ధావన్ - కీర్తి సురేష్ జంటగా నటించిన 'బేబీ జాన్' అనే చిత్రాన్ని నిర్మించారు. ఇది విజయ్ నటించిన హిట్ చిత్రం 'తెరి'కి రీమేక్. ఈ నేపథ్యంలో తన ఎక్స్ ఖాతాలో ఆమె ఓ ట్వీట్ చేస్తూ ఆగస్టు 30వ తేదీన కొత్త ప్రాజెక్టుకు సంబంధించి ప్రకటన చేయనున్నట్టు ఓ వీడియో షేర్ చేశారు. మరోవైపు, 'జవాన్' చిత్రం తర్వాత అట్లీ బాలీవుడ్‌పైనే దృష్టిని కేంద్రీకరించినట్టు తెలుస్తుంది. తమిళంలో ఆయన చేపట్టే ప్రాజెక్టుపై ఇంత వరకు స్పష్టతరాలేదు.


విద్యుద్దీపాలంకరణతో వేలాంకన్ని చర్చి

నేటినుంచి వేలాంకన్ని చర్చి వార్షికోత్సవాలు

ప్యారీస్, ఆగస్టు 28: నాగపట్టణం జిల్లాలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన వేలాంకన్ని చర్చి వార్షికోత్సవాలు ఈ నెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చే సెప్టెంబరు 8వ తేది వరకు కొనసాగనున్న ఈ ఉత్సవాలకు సంబంధించి ఆలయ యజామాన్యం భారీ ఏర్పాట్లు చేపట్టింది. 29 సాయంత్రం 5.45 గంటలకు చర్చి ప్రాంగణంలోని స్తంభంపై అమ్మవారి చిత్రపటంతో రూపొందించిన పతాకాన్ని తంజావూరు జిల్లా బిషప్ టి.సహాయరాజ్ ఆవిష్కరిస్తారు. ఆలయ ఫాదర్లు, బిషప్‌లు పాల్గొంటారు. ఈ ఉత్సవాల్లో ప్రధానాంశంగా సెప్టెంబరు 7 సాయంత్రం వేలాంకన్ని అమ్మవారిని రథంలో ఊరేగిస్తారు. మరుసటిరోజు అమ్మవారికి పట్టాభిషేకం చేస్తారు. పతాకావిష్కరణ కార్యక్రమంలో చర్చి ఫాదర్లు అర్పుదరాజ్, సి.హృదయరాజ్, డి.ఉలగనాధన్ పాల్గొంటారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనేందుకు వీలుగా గురువారం నాగపట్టణం, కీల్‌వేలూరు ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలకు జిల్లా కలెక్టర్ ఆకాష్ సెలవు ప్రకటించారు. ఈ సెలవు రోజు భర్తీచేసేలా సెప్టెంబరు 29న విద్యాసంస్థలు పనిచేస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. మొత్తం 11 రోజుల పాటు జరుగనున్న ఈ వేడుకల్లో తమిళం, మరాఠీ, కన్నడం, ఆంగ్లం, కొంకిణి, హిందీ, మలయాళం, తెలుగు భాషలలో ప్రత్యేక ఆరాధనా కార్యక్రమాలు, అలాగే సంక్షేమ సహాయాల పంపిణీ, శిలువమార్గం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా, పతాకావిష్కరణ ఉత్సవంలో పాల్గొనేందుకు చెన్నై సహా పలు జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు మాలధారణ చేసి వేలాంకన్నికి పాదయాత్రగా వెళుతున్నారు. వార్షికోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వ రవాణా సంస్థలు వేలాంకన్నికి ప్రత్యేక బస్సులు, దక్షిణ రైల్వే ప్రత్యేక రైళ్ల నడుపనున్నట్లు ప్రకటించాయి. అదేవిధంగా స్థానిక అడయార్ బీసెంట్‌నగర్‌లో ఉన్న పునీత వేలాంకన్ని ఆలయంలో కూడా 52వ వార్షిక ఉత్సవాలు పతాకావిష్కరణతో అత్యంత వైభవంగా గురువారం ప్రారంభమవుతున్నాయి.

కార్పొరేషన్ స్కూళ్లలో ఫ్రెంచ్ బోధన

● అలెయన్స్ ఫ్రాంచైస్‌తో ఒప్పందం


మేయర్ ప్రియ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకున్న కమిషనర్ కుమారగురుబరన్, అలయన్స్ ఫ్రాంచైస్ ఆఫ్ మద్రాస్ డైరెక్టర్ పెట్రీషియా థెరిహర్ట్


చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కార్పొరేషన్ పాఠశాలలో ఫ్రెంచ్ భాషను బోధించడానికి అలయన్స్ ఫ్రాంచైస్ ఆఫ్ మద్రాస్ సంస్థతో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ బుధవారం సాయంత్రం అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో అలెయెన్స్ ఫ్రాంచైస్ ఆఫ్ మద్రాస్ డైరెక్టర్ పెట్రీషియా థెరిహర్ట్, ఫ్రెంచ్ కాన్సులేట్ జనరల్ లిసీ టాల్బోట్ బీరీ, డిప్యూటీ కాన్సుల్ జనరల్ క్రిస్టోఫీ బారాముల్లీ, మేయర్ ఆర్. ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కమిషనర్ జే కుమారగురుబరన్ తదితరులు పాల్గొన్నారు.

జీఐఏఎఫ్ఐతో ఎస్ఆర్ఎం ఒప్పందం


ఒప్పంద పత్రాలతో డాక్టర్ వీపీ చంద్రశేఖరన్, జీఐఏఎఫ్ఐ అధ్యక్షుడు ప్రశాంత్ ఆర్ మిశ్రా తదితరులు

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జనరల్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఇంటిగ్రేటెడ్ సంస్థతో కాట్టాన్‌కుళత్తూరులోని ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్స్ బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.ఆ ప్రకారం ఆ సంస్థలో సభ్యత్వం కలిగిన ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే సుమారు 9 వేలమందికి వైద్యులతో సంప్రదింపులు (కన్సల్టేషన్స్), వైద్య పరీక్షలు, ఆరోగ్యబీమా పథకంతో ఉచిత చికిత్సను ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్స్ అందిస్తుందని చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ వీపీ చంద్రశేఖరన్ తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆస్పత్రి అధ్యక్షులు డాక్టర్ పి.సత్యనారాయణన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓ సందేశం విడుదల చేశారు. జీఐఏఎఫ్ఐ అఖిలభారత అధ్యక్షుడు ప్రశాంత్ ఆర్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

మేఘాల్లో శివలింగం భక్తుల పరవశం



పెరంబూర్, ఆగస్టు 28: ఈరోడ్ జిల్లాలో మంగళవారం సాయంత్రం సూర్యుడు అస్తమించిన తర్వాత మేఘాల మధ్య సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. కొన్ని ప్రాంతాల్లో మేఘాల సమూహం ఎరుపు రంగులోను, సూర్యాస్తమయం సమయంలో వివిధ రంగులు కనిపించాయి. భవాని సమీపం ఊరాచ్చికోట కొండ ప్రాంతంలో సాయంత్రం ఆకాశం మేఘావృతమై మేఘాలు శివలింగం రూపానికి చేరుకున్నాయి. సమయం గడిచే కొద్దీ ఎరుపు రంగు మధ్య శివలింగం ఆకారం స్పష్టంగా దర్శనమిచ్చింది. ఈ దృశ్యాన్ని చూసిన భక్తులు పరవశం చెందారు. కొందరు ఈ దృశ్యాలు సెల్‌ఫోన్‌లో బంధించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.


మొక్కలు నాటుతున్న వీఐటీ వర్సిటీ వైస్ ఛాన్సలర్ జీవీ సెల్వం

సీఎంసీ తరపున గ్రీన్ వేవ్ పథకం ప్రారంభం

వేలూరు, ఆగస్టు 28: స్థానిక సీఎంసీ వైద్యకళాశాల పసుమై అలై (పచ్చదనం అలలు) అనే పథకాన్ని బుధవారం ప్రారంభించారు. సీఎంసీ ఆధ్వర్యంలో 10 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. 'గ్రీన్ వేవ్' పేరుతో చేపట్టిన ఈ పథకం లాంఛనంగా ప్రారంభించారు. వీఐటీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జీవీ సెల్వం మొక్క నాటి పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ డా.విక్రమ్ మెహదీవ్ మాట్లాడుతూ...ఆస్పత్రి చుట్టుపక్కల ఉన్న 50 గ్రామాల్లో 10 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు తెలిపారు.

టీఆర్ఎస్ శర్మ - సాహిత్యం: అవలోకనంపై నేడు జాతీయ సదస్సు

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో గురువారం 'టీఆర్ఎస్ శర్మ - సాహిత్యం: అవలోకనం' అనే అంశంపై జాతీయ సదస్సు జరుగనుంది. మెరీనా ఆవరణలోని రజతోత్సవ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభ సమావేశం జరుగనుంది. తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు సభాధ్యక్షత వహించనున్న ఈ కార్యక్రమానికి డాక్టర్ పాండురంగం కాళియప్ప స్వాగతం పలుకనుండగా, అలేఖ్య లెదర్స్ అధినేత నర్రావుల వేంకటరమణ ముఖ్య అతిథిగా, పారిశ్రామికవేత్త పసుమర్తి బద్రినాథ్ విశిష్ట అతిథిగా, రాజధాని కళాశాల విశ్రాంత తెలుగుశాఖాధ్యక్షురాలు డాక్టర్ ఎ.ఆంబ్రూణి గౌరవ అతిథిగా, తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు తమ్మినేని బాబు ఆత్మీయ అతిథిగా హాజరుకానున్నారు. కవి,రచయిత డాక్టర్ టీఆర్ఎస్ శర్మ తన దృష్టి కోణం ఆవిష్కరించనుండగా, హైదరాబాద్‌లోని యోగాలయ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన డాక్టర్ విశ్వర్షి వాసిలి వసంతకుమార్ కీలకోపన్యాసం చేయనున్నారు. డాక్టర్ మాదా శంకరబాబు వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగియనుంది. అనంతరం 11 గంటలకు మొదటి సమావేశం, 12 గంటలకు ద్వితీయ సమావేశం, 2 గంటలకు తృతీయ, 3 గంటలకు నాలుగో సమావేశం, 4 గంటలకు సమాపనోత్సవం జరుగనుంది. దీనికి రెప్కో బ్యాంకు విశ్రాంత జనరల్ మేనేజర్ వంజరపు శివయ్య ముఖ్య అతిథిగా, జనని అధ్యక్షులు డాక్టర్ నిర్మలా పళనివేలు విశిష్ట అతిథిగా, మదురై కామరాజ్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ గౌరవ అతిథిగా హాజరుకానుండగా, రాజధాని కళాశాల తెలుగుశాఖాధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎలిజబెత్ జయకుమారి కీలకోపన్యాసం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.


'సాత్ సిటీ 324 ఎం డిస్ట్రిక్ట్' అధ్యక్షురాలు డాక్టర్ ఏవీ శివకుమారి చెన్నై,ట్రస్టుపురం 7వ వీధిలో పేద పిల్లలకు బుధవారం నూతన వస్త్రాలు వితరణ చేస్తున్న దృశ్యం


ఇటీవల బ్రెయిన్ సర్జరీ అనంతరం కోలుకుంటున్న చెన్నై అన్నానగర్ టీపీ ఛత్రం ప్రాంతానికి చెందిన అన్నాడీఎంకే సీనియర్ నేత రాయల్ వెంకటేశన్‌ను పరామర్శిస్తున్న ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి డాక్టర్ సునీల్, వివిధ విభాగాల నేతలు


అన్నా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బుధవారం 'మీండుమ్ మంజపై' పథకం వార్షికోత్సవం సందర్భంగా పసుపు సంచుల పంపిణీ ప్రారంభిస్తున్న పర్యావరణ శాఖ మంత్రి శివ వి మెయ్యనాథన్ రాష్ట్ర కాలుష్య నియంత్రణా మండలి చైర్‌పర్సన్ ఎం.జయంతి తదితరులు

విక్రవాండిలో విజయ్ పార్టీ మహానాడు


విల్లుపురం డీఎస్పీ తిరుమాళ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న తమిళగ వెట్రి కళగం ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్

చెన్నై, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తమిళ సినీ నటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం మహానాడు విల్లుపురం జిల్లా విక్రవాండిలో నిర్వహించనున్నారు. ఇటీవల పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన విజయ పార్టీ తొలి మహానాడును సెప్టెంబర్ 22న భారీ స్థాయిలో జరుపనున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు మహానాడు నిర్వహించేందుకు మదురై, తిరుచ్చి, కోయంబత్తూరు, తంజావూరు నగరాల్లో ఏదైనా ఒక ప్రాంతాన్ని ఎంపిక చేయాలని భావించారు. చివరకు విల్లుపురం జిల్లాలో చెన్నై - తిరుచ్చి జాతీయ రహదారిలో విక్రవాండి సమీపంలోని వి.సాలై గ్రామం వద్దనున్న 150 ఎకరాల విస్తీర్ణం కలిగిన మైదానంలో మహానాడు నిర్వహించాలని నిర్ణయించారు. మహానాడు జరుగనున్న తేదీ కూడా మార్చారు. ఆ మేరకు పార్టీ మహనాడు సెప్టెంబర్ 23న జరుగుతుందని విజయ్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో మహానాడు నిర్వహించేందుకు అనుమతి కోరుతూ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ విల్లుపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఆ తర్వాత మహనాడుకు భద్రతా ఏర్పాట్లు కల్పించాలని కోరుతూ డీఎస్పీ తిరుమాల్ వద్ద బుస్సీ ఆనంద్ దరఖాస్తు సమర్పించారు.


చెన్నై ఎగ్మూరు రాజరత్తినం స్టేడియంలో కానిస్టేబుళ్ల ఎంపిక కోసం నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షల్లో ఓ అభ్యర్థి ఎత్తు కొలుస్తున్న పోలీసు అధికారిణి, పరుగు పందెంలో పాల్గొంటున్న మహిళా అభ్యర్థులు


రేపటి నుంచి వీఐటీ వర్సిటీలో 'రైతు సదస్సు'

అడయార్, ఆగస్టు 28: రాష్ట్రంలోని ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటైన వీఐటీ యూనివర్సిటీ ప్రతి యేటా రైతు సదస్సు, 'ఊళవర్ కళంజియం' పేరుతో వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ యేడాది ఈ నెల 30, 31వ తేదీల్లో ఈ సదస్సు నిర్వహించనుంది. గత ఏడేళ్ళుగా ఈ తరహా సదస్సును వీఐటీ విజయవంతంగా నిర్వహిస్తోంది. ఈ దఫా నిర్వహించే సదస్సును 'వ్యవసాయంలో సాంకేతిక ఆవిష్కరణ : ప్రకృతితో మమేకమైన వ్యవసాయం' అనే అంశంతో నిర్వహించేలా ఏర్పాట్లు చేసింది. ఇందులో 130కి పైగా వ్యవసాయ స్టాళ్లను ఏర్పాటుచేయనుంది.దీనికి తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం,వ్యవసాయ విజ్ఞాన సంస్థ,తమిళనాడు వ్యవసాయ శాఖ, వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం, ఉద్యానవనశాఖ, పశుసంవర్థక శాఖ, సీడ్ టెస్టింగ్ ఏజెన్సీ (విత్తన ధృవీకరణ విభాగం), వ్యవసాయ మార్కెటింగ్ విభాగంతో పాటు వివిధ వ్యవసాయ అనుబంధ విభాగాలతో పాటు ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, నాబార్డ్, గ్రీన్ వికటన్ అనే అగ్రికల్చర్ మీడియా విభాగాలు పాలుపంచుకుంటున్నాయి. రాష్ట్రంలోని వేలూరు, రాణిపేట, తిరువణ్ణామలై, తిరుపత్తూరు జిల్లాలతో పాటు అనేక జిల్లాల్లో సాంకేతికత ఆధారిత వ్యవసాయం, ప్రకృతి ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా ఈ సదస్సు దోహదపడనుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో వ్యవసాయ రంగ నిపుణులు, శాస్త్రవేత్తలు, అనుభవజ్ఞులైన రైతులు, వ్యవసాయ రంగంలో రాణించిన వ్యాపారవేత్తలు, విద్యార్థులు హాజరై తమ అభిప్రాయాలను, అనుభవాలను పంచుకోనున్నారు.